మాకూ పథకాలు ఇవ్వాలి

- 'సాక్షి' ప్రజా అజెండా కార్యక్రమంలో వ్యాపారవర్గాల వినతి
- రైళ్ల రాకపోకలు రెగ్యులర్‌గా కొనసాగితే మేలు
- పార్కింగ్ లేకపోవడంతో వినియోగదారులకు సమస్య


'సాక్షి' ప్రజా అజెండా సమావేశంలో మాట్లాడుతున్న వ్యాపారులు

కొత్తగూడెంఅర్బన్: దశాబ్దాకాలం కిందట వస్త్ర వ్యాపారాల కేంద్రంగా కొత్తగూడెంనకు పేరుండేది. కాలక్రమేణా వ్యాపారాలన్నీ కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లడంతో స్థానిక వస్త్ర వ్యాపారులు, కిరాణం, ఎలక్ట్రికల్, దర్జీల్లో పలువురు గుమస్తాలుగా మారారు. సింగరేణి సంస్థ సూచనలతో బొగ్గుగని కార్మికులకు, వారి కుటుంబాలకు సౌకర్యాలు కల్పించేందుకు అటవీ ప్రాంతంగా ఉన్న కొత్తగూడెంనకు వచ్చి దశాబ్దాలుగా వ్యాపారం చేస్తే మిగిలిందేమీ లేకపోగా.. ఇప్పుడు రోడ్డున పడినట్లయింది. ప్రస్తుతం కార్పొరేట్ మాళ్ల ఏర్పాటుతో స్థానిక వ్యాపారాలు కుదేలయ్యాయి. ఈ మేరకు వ్యాపారులను సాధారణ ప్రజలుగా భావించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాల్సిన అవసరముందని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ 'సాక్షి' ప్రజా అజెండాలో భాగంగా జిల్లా కేంద్రంలోని వ్యాపారులతో డిబేట్ నిర్వహించగా.. వారు తమ సమస్యలను వెల్లడించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న అంశాలను వెల్లడించారు.

పథకాలన్నీ వర్తింపజేయాలి

అధికారంలోకి ఏ ప్రభుత్వం వచ్చినా కొత్తగూడెంలోని పాతతరం వ్యాపారులను ఆదుకోవాలని కోరారు. రైతులు, ఇతర కమ్యూనిటీలకు ఇస్తున్నట్లు తమకు కూడా రుణాలు, మాఫీ వర్తింపజేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా కొత్తగూడెంలో ట్రాఫిక్ పోలీసులు.. వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసేలా జరిమానాలు విధిస్తుండడం కూడా వ్యాపారాలు దెబ్బతినడానికి ఓ కారణమవుతోంది. ఇక్కడ పార్కింగ్ జోన్లు లేకపోవడంతో సమస్య ఎదురవుతుండగా.. దాన్ని పక్కన పెట్టి వాహనాలదారులను ఆందోళనకు గురిచేస్తుండటం సరి కాదని అభిప్రాయపడ్డారు.

అన్ని రైళ్ల రాకపోకలు సాగిస్తే..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అన్నిరకాల వ్యాపారాలు మునుపటి కళ సంతరించుకోవాలంటే రైళ్లన్నింటినీ పునరుద్ధరించాలి. కరోనా కాలంలో రద్దు చేసిన రైళ్లు చాలా వరకు మళ్లీ మొదలుకాలేదు. ఇది కూడా వ్యాపారాలు పడిపోవడానికి కారణమేనని చెబుతున్నారు. ఈ విషయంలో రైల్వే అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు. ఇక కొత్తగూడెంలో ముర్రేడువాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి. కొత్తగూడెంలో బైపాస్ రోడ్డు కూడా అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెంనకు వచ్చే వినియోగదారులకు ప్రయాణ సౌకర్యాలన్నీ అందుబాటులోకి వస్తే వ్యాపారులకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పథకాలు వర్తింపజేయాలి



అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు పాతతరం వ్యాపారులకు పథకాలను వర్తింపజేయాలి. బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించి, రుణమాఫీకి అవకాశం కల్పించాలి. వ్యాపార రంగంలో కార్పొరేట్ దాడికి చిరు వ్యాపారులు గుమస్తాలుగా మారారు. అలాంటి వారిని ఆదుకోవాలి.

–మొరిశెట్టి భవానీప్రసాద్, కొత్తగూడెం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ

మాల్స్‌తో ఉపాధికి దూరం



ఇటీవల కాలంలో కొత్తగూడెం, పాల్వంచ ఏరియాల్లో అన్ని రంగాల్లో మాళ్లు ఏర్పాటయ్యాయి. దీంతో ఏళ్ల తరబడి వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులు పనులు కోల్పోతున్నారు. దుకాణాల్లో విక్రయాలు సరిగా లేక కార్మికులను తీసివేయాల్సిన పరిస్థితి ఉంది. అలాంటి వారికి ఉపాధి కల్పించాలి.

–పల్లపోతు శ్రీనివాస్, జీపీటీ మార్కెటింగ్ చైర్మన్

పార్కింగ్ జోన్ లేక అవస్థలు



కొత్తగూడెంలో ప్రధానంగా పార్కింగ్ జోన్ లేకపోవడం వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. షాపుల ముందు పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ వారు ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల ఫొటోల కారణంగా రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

–అబీద్, టైలర్ అసోసియేషన్ నాయకుడు

రైళ్లన్నీ పునరుద్ధరించాలి



కొత్తగూడెం నుంచి రాకపోకలు సాగించే రైళ్లను పునరుద్ధరించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. రైళ్ల రాకపోకలు సరిగా లేకపోవడం, కొన్ని రైళ్లు రద్దు కావడం వలన ఇతర ప్రాంతాల నుంచి కొత్తగూడెంనకు వినియోగదారులు రాలేని పరిస్థితి ఉంది. దీంతో వ్యాపారాలు జరగని పరిస్థితి ఉంది.

–రవి, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ నేత

క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థి బయోడేటా



నియోజకవర్గం: ఇల్లెందు
పేరు: కోరం కనకయ్య
భార్య: కోరం లక్ష్మి (బంజార)
విద్యార్హత: ఇంటర్‌మీడియట్ (బీఏ)
వయసు: 61 ఏళ్లు
స్వస్థలం: కోయగూడెం, టేకులపల్లి మండలం

నిర్వర్తించిన పదవులు
- 1984లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన 1986లో బేతంపూడి పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.
- 1995 నుంచి 2000 వరకు టేకులపల్లి జెడ్పీటీసీగా పనిచేశారు.
- 2014లో ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

పార్టీ పదవులు
- 1991–94లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్‌గా,
- 1996–2001లో డీసీసీ కార్యదర్శిగా,
- 2002లో డీలిమిటేషన్ కమిటటీ సభ్యుడిగా,
- 2004లో పీసీసీ ఎస్టీ సెల్ కన్వీనర్‌గా వ్యవహరించారు.

జనసేనలోకి లక్కినేని

టేకులపల్లి: టేకులపల్లికి చెందిన బీజేపీ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ లక్కినేని సురేందర్‌రావు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గత నెల 9న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన ఆయన సోమవారం హైదరాబాద్‌లోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో తన అనుచరులతో పవన్‌కల్యాణ్‌ను కలిసి జనసేనలో చేరారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ – జనసేన పొత్తులో భాగంగా కొత్తగూడెం టికెట్ తనకు ఇవ్వాలని కోరానని, సానుకూల స్పందన వచ్చిందని వివరించారు.

మూడో రోజు రెండు..


నామినేషన్ వేస్తున్న చీమల వెంకటేశ్వర్లు

ఇల్లెందు: ఇల్లెందు అసెంబ్లీకి మూడో రోజు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. సోమవారం కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి చీమల వెంకటేశ్వర్లు తన మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి, మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ల కృష్ణ మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు యూసీసీఆర్ ఎంఎల్ అభ్యర్థి పోలెబోయిన రవి, కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థులు కోరం కనకయ్య, మంగీలాల్‌నాయక్ నామినేషన్ దాఖలు చేశారు.

కుమురం భీంకు నివాళి

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కుమురం భీం 83వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జెండాను ఎగురవేశారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు ఈసం కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో మామిడిగుండాల, లచ్చగూడెం సర్పంచ్‌లు కుంజ కృష్ణ, మాడె సునీత, నాయకులు ముక్తి వెంకట్, కుంజా విజయ్, సూర్ణపాక జంపయ్య పాల్గొన్నారు.

7నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

టేకులపల్లి: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రామానుజాచార్యుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. వేడుకల్లో భాగంగా 7, 8వ తేదీల్లో పూజలు, 9న ఉదయం 11.53 గంటలకు రామానుజాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్‌లు బోడ నిరోషా, బోడ సరితతోపాటు కుడితి చెన్నకేశవరెడ్డి, గుడిపూడి సత్యనారాయణ, బోడ మంగీలాల్, ఇస్లావత్ మంగ్య, నరేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి వీరభద్రం ప్రచారం

జూలూరుపాడు: వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కాగా, మాచినేనిపేటతండాకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకుడు సురేశ్ కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబాన్ని పరామర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్, నాయకులు లకావత్ శ్రీను, లకావత్ బుజ్జి, లకావత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీలను గెలిపించండి..


మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

ఇల్లెందురూరల్: ప్రజా వ్యతిరేక శక్తులను ఓడించాలని, విప్లవ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, గాదె ఝూన్సీ పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ ఇల్లెందు నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశం సోమవారం ఆవునూరి మధు, జడ సీతారామయ్య అధ్యక్షతన జరిగింది. వెంకట్రామయ్య మాట్లాడుతూ.. పదేళ్లుగా అనేక వాగ్దానాలు కురిపించి అమలు చేయకుండా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని, నేడు కొత్త మాటలతో కొత్త మేనిఫెస్టోతో ప్రజల ముందు కొస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దని సూచించారు. ప్రజలంతా అప్రమత్తమై భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు నిర్వహిస్తున్న విప్లవ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్డీ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి మోకాళ్ల కృష్ణ, నాయకులు బండారు ఐలయ్య, రాజేంద్రప్రసాద్, తుపాకుల నాగేశ్వరరావు, యాకన్న, నందగిరి వెంకటేశ్వర్లు, గౌని ఐలయ్య, జడ సత్యనారాయణ, విశ్వనాథం, రాసుద్దీన్, యదల్లపల్లి సత్యం, మదార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'త్రివేణి' ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాల్వంచలోని సన్‌రైజ్ స్పోర్ట్స్, చారిటీక్లబ్ ఆధ్వర్యాన సోమవారం జీయర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ (2023–24) నిర్వహించారు. అందులో రెండు విభాగాల నుంచి 5వ తరగతి చదువుతున్న పవన్ శ్రీకర్, ఆరో తరగతి చదువుతున్న బి.ఈశ్విత ప్రథమ బహుమతులు సాధించారు. వారిని త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి జగదీశ్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య సోమవారం అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఏ అలీం

సుజాతనగర్: స్థానిక మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తూ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు నేరుగా పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. 2023–24 ఏడాదికి గాను పత్తికి ప్రభుత్వం రూ.7,020 కనీస మద్దతు ధరను ప్రకటించిందని చెప్పారు. కార్యక్రమంలో సీసీఐ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సీసీఐ సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటేయండి..


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాల్వంచ: ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనలు, ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటును వినియోగించుకోవాలని పాల్వంచ, కొత్తగూడెం డీఎస్పీలు వెంకటేశ్, రెహమాన్, సీఆర్‌పీఎఫ్ ఏసీ సందీప్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం పట్టణంలో పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బీసీఎంరోడ్, కేఎస్పీరోడ్‌లలో ర్యాలీ నిర్వహించగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం నుంచి కొత్తగూడెం వైపు అనుమతి పత్రాలు లేకుండా వెళ్తున్న ఇసుక లారీని ఆదివారం సాయంత్రం రెవెన్యూ ఆర్ఐ రాము గుర్తించి సీజ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో 2023–24 సంవత్సరానికి గాను అతిథి అధ్యాపక పోస్టు (హిస్టరీ–1) భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి, బోధనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. దరఖాస్తులు ఈ నెల 7వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలని, 8వ తేదీన ఇంటర్వ్యూకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 99082 22961 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సామగ్రి వితరణ

పాల్వంచ: పట్టణంలోని కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ హఫీజ్ ఆట వస్తువులు, కుర్చీలు, ఫ్యాన్‌లను వితరణగా అందించారు. కార్యక్రమంలో పీడీపీఓ కనకదుర్గ, అంగన్‌వాడీ టీచర్ నాగమణి పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షం

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటల సమయంలో కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంటన్నర పాటు వర్షంతో పాటు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొత్తగూడెంలో రైల్వే అండర్ బ్రిడ్జి, పోస్టాఫీస్, బస్టాండ్ సెంటర్లలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పేషెంట్లు, వైద్య సిబ్బంది అసౌకర్యానికి గురయ్యారు. డీజిల్ లేక జనరేటర్ కూడా ఆన్ చేయలేదు. పాల్వంచలో సైతం పలు వీధులు జలమయమయ్యాయి.

వారికి ఓట్లు ఎందుకు?

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నోటిఫైడ్ ఏరియా నుంచి మున్సిపాలిటీగా మారి ఏళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని బీఎస్పీ కొత్తగూడెం అభ్యర్థి ఎర్రా కామేశ్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 18, 19, 20వ వార్డుల్లో సోమవారం ఆయన ప్రచారం చేశారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించని వారికి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు.

అభివృద్ధి చేశాం.. పథకాలు ఇచ్చాం..

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: గతంలో ఎన్నడూ కనిపించని అభివృద్ధిని చూపించాం.. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించాం.. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా వాటిని తమ వద్దకు చేర్చుకునేందుకు బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. మండలంలోని బోయితండా, మాణిక్యారం గ్రామపంచాయతీల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఆమె కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రసంగించారు. తుంటుబాలుతండా నుంచి పోచారంతండా వరకు రూ.3.40 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు చేయించుకున్నామని గుర్తుచేశారు. అటవీశాఖ నుంచి అభ్యంతరాలు రావడంతో పనుల ప్రారంభంలో ఆలస్యం చోటుచేసుకుందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. మాణిక్యారం నుంచి ఒంపుగూడెం మీదుగా పాఖాల బీటీ రోడ్డు వేయించామన్నారు. ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా అందిస్తూ ఆదుకుంటోందని స్పష్టం చేశారు. ఆసరా పింఛన్లు రూ.6 వేలకు పెంచుతున్నామని, ప్రతి మహిళకు ఆర్థిక సహాయం, గ్యాస్ ధర రూ.400కు అందిస్తామని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలకు తోడు మరిన్ని పథకాలను పేదలకు అందించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని, మరోసారి సీఎంగా కేసీఆర్‌ను ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, నాయకులు లష్కర్, రమేశ్, తాండ్ర నాగరాజు, రెంటాల సద, కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఎడవల్లికే ఇవ్వాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ బీసీ నాయకుడైన ఎడవల్లి కృష్ణకే ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ బీ–బ్లాక్, పాల్వంచ టౌన్, చుంచుపల్లి మండలాల అధ్యక్షులు రాయల శాంతయ్య, నూకల రంగారావు, అంతోటి పాల్ మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభిమానులు ఎక్కువగా ఉన్నందున, బీసీ నేత అయిన ఎడవల్లి కృష్ణకు టికెట్ ఇస్తే గెలుపు సునాయాసమవుతుందని తెలిపారు. అలాకాకుండా పొత్తు పేరిట సీపీఐకి కేటాయిస్తే ఓడిపోతారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల అధ్యక్షులు సకినాల వెంకటేశ్వరరావు, చింతలపుడి రాజశేఖర్, కొండం వెంకన్నగౌడ్‌తో పాటు పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేశ్, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'యాదవ మహాసభ' బలోపేతానికి కృషి


యాకయ్యకు నియామకపత్రం ఇస్తున్న దృశ్యం

పాల్వంచ: అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచకు చెందిన వల్లపు యాకయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చా శ్రీనివాసరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెలబోయిన రమేశ్‌యాదవ్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం యాకయ్య మాట్లాడుతూ సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కె.పరమేశ్‌యాదవ్‌తో పాటు దుబాకుల కిరణ్, వెంకటనారాయణ, నాగరాజు, అంకయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

ధర్మా మృతికి పలువురి సంతాపం


నివాళులర్పిస్తున్న కూనంనేని తదితరులు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వనమా తదితరులు

కొత్తగూడెంఅర్బన్/సుజాతనగర్/చుంచుపల్లి/ఇల్లెందు: సుజాతనగర్ మండలం మంగపేటకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుగులోత్ ధర్మా మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా, కొత్తగూడెం విద్యానగర్‌కు.. అక్కడి నుంచి స్వస్థలమైన మంగపేటకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, కాసాని ఐలయ్య, సాయిబాబా, వీర్ల రమేశ్ తదితరులు ధర్మా మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, ధర్మ మృతదేహం వద్ద ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు కాసుల వెంకట్, బత్తుల వీరయ్య, ఎండీ రజాక్, సత్యనారాయణ, రాజేవ్ పాల్గొన్నారు. ఇంకా కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ధర్మా మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ, నాయకులు మోహన్‌రావు, శ్రీనివాస్, లక్ష్మి కూడా నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

విశ్వరూప మహాసభకు తరలిరావాలి


శంభునిగూడెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 11న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న విశ్వరూప మహాసభకు మాదిగలు, ఉప కులాల వారు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలవాల రాజా పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారం చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ నిర్వహిస్తున్న సభకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నల్లగట్ల వెంకన్న, మెంతెన ప్రభాకర్, చింతల మోహన్‌రావు, జినక ఇస్తారి, నారపోగు దేవేందర్, సురేశ్, కాపాడి నరేశ్, మహేశ్, శంకర్, పోలేపొంగు వెంకన్న పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. 3న న్యూఢిల్లీ ఫరీదాబాద్‌లోని మ్యాజిక్, ఆర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు రంగాల్లో ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు అందజేశారు. అందులో భాగంగా వెంకటేశ్వరరావుకు ముఖ్య అతిథులు డాక్టర్ గణగళ్ల విజయ్‌కుమార్, బాలీవుడ్ చిత్ర దర్శకుడు మనోజ్‌కుమార్ భాటియా డాక్టరేట్ అందించారు. కాగా, సోమవారం వెంకటేశ్వరరావు విలేకరులకు సోమవారం వివరాలు వెల్లడించారు. డాక్టరేట్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు.